అంతర్నాటకము

శతావధాని వేలూరి శివరామశాస్త్రి గారు

నాటకసంస్కారము చేయ నెంచిన రసోపాసకబృందమువా రందఱూ బ్రాహ్మమతమున సాధారణశాఖకు చెందినవారు; అందఱూ బహుభాషావల్లభులు; అందఱూ స్త్రీపాత్రమును స్త్రీలే అభినయింపఁగోరువారు. వా రెప్పుడూ సంగీతమును పొడిగింపనూ లేదు; కుంచీకరింపనూ లేదు. పాటలకు ప్రేక్షకులు ఎంత అల్లరి చేసినను లేనిచోట వా రొకపాటయేని పాడ లేదు, ఉన్నచోట మానా లేదు. శిలావర్షము కురిసినను వారు ఒక నిముసమేని ప్రదర్శనమును ఆఁప లేదు.

ఆసంఘమున ఎవరును నాట్యమును జీవికకు ఉపయోగించుకొన లేదు. ప్రకటించి ప్రదర్శనమును ఎన్నఁడును ఆఁప లేదు. వారికి తెరలూ మరలూ వాద్యములూ చోద్యములూ ఎక్కువగా లేవు.

వారి ప్రదర్శనములకు మొదటమొదట పామరులు వచ్చుట ఎటులు తగ్గఁదొడఁగెనో పిదప పిదప సహృదయులు వచ్చుట అటులు హెచ్చఁదొడఁగెను. రమ్మనిపిలిచినను పోలీసులురారు.

వారిప్రదర్శనము ఒకచక్రమువలె జరుగును. కన్నుమూయుచో దానియాకు కానరాదు. రాముఁడు ఎప్పుడూ బూట్సులు తొడుగలేదు; చారుదత్తుఁ డెన్నఁడూ జందెము వేసికొనుట మఱవలేదు.

చైతన్యచంద్రోదయము, రామకృష్ణచరిత, కబీరుకథ, శాకుంతలోత్తరరామచరిత మృచ్ఛకటికములు వారిప్రదర్శనములలో ఉత్తమములు. వాడుకభాషలో వ్రాయఁబడిన కొన్ని నాటకములను వారు ప్రదర్శించుచుండఁగా కేవల గ్రాంథికభాషావాదులుకూడ చూడరా మొదలిడిరి.

ఆసంఘమునందు కొందఱకు స్వనామములు తుడిచిపెట్టుకొనిపోయి వానికి బదులు రామ దుష్యంత చారుదత్తాదినామములు ఖాయమయిపోయినవి.

ఆసంఘమున పాత్రధారణ మొనరింపని గౌరవసభ్యులు పలువురు కలరు. వారు వలయుచో తెరలు లాఁగుదురు; ప్రేక్షకు లగుదురు; వాచకు లగుదురు.

వారిలో ముఖ్యుఁడు గోపాలుఁడు. ఆతనికి ఇంటిపేరు ఏమోకాని ప్రకృతము ఐ. సి. యనే ఇంటిపేరు. ఇంకను శంకరుఁడు, బిందుమాధవుఁడు, రాధాకాంతుఁడు, బలభద్రుఁడు, వాసుదేవుఁడు మొదలగువారు కలరు. వీరు డిప్టీకలెక్టర్లు, తహసీల్దార్లు, ప్లీడర్లు, భూస్వాములు. స్త్రీలే స్త్రీపాత్రములు ధరింపవలె నని వారి అభిమతము. వారాంగనలను చేర్చికొనరాదని వారి తలఁపు. అందఱూ తమతమ భార్యలను పాత్రధారణ మొనరింపఁ గోరిరి.

ఎవరిభార్యయు అందులకు అంగీకరింపలేదు. బలాత్కరించుట పాడి గాదనుకొని కొందఱు వారికి నయాన భయాన బోధించుచుండిరి. అందు ఐ. సి. యస్. గోపాలుఁ డగ్రేసరుఁడు. ఐ. సి. యస్. గోపాలుఁడు ఈ విషయమును ప్రణయకలహమునకు దింపెను. క్రమక్రమముగా అందలి ప్రణయము జాఱిపోయెను.

౨

ప్రకృతియొక్క శృంగారమందిరాంతరాళమున వెండినీరు తీసిన చాందినీవలె వెన్నెల వ్రేలాడుచుండెను. మల్లెపూలు, ముత్యాలసోగులు, శతపుష్పాపుష్పములు, రత్నహారములు, ఆరముగ్గిన మావిపండ్లు, బంగారుగులోబులు వనదేవతావాసకసజ్జికా ప్రాంతమున గోదావరి చేటికవలె నిలువఁబడి యుండెను.

డాబామీఁద వేణుగోపాలుఁడు ఒకశయ్యమీఁదను, రాధ వేఱొకశయ్యమీఁదను శయనించి యుండిరి. వారి కనులుమూసికొనియే యుండెను. అవయవము లన్నియు పానము వహించెను. ఒకరినూర్పు ఇంకొకరికి వినఁబట్టను. నిష్కంపములగు రెండుసముద్రములు జంటగా శయనించెను.

గోపాలుఁడు నిదిరించె నని రాధ, రాధ నిదిరించె నని గోపాలుఁడు. ఇటు లనుకొనుట రెండునెలలనుండి.

ప్రణయకలహము ప్రేమయొక్క గొలుసుకట్టు. దానిలో కాలాతురములు కానరావు. అది భయంకరము. అది అద్వైతమునందు పర్యవసించు ద్వైతము. దీని కొలిమిలో గరళము కరఁగి కరఁగి అమృత మగును.

చంద్రికా మారుతముల సమ్మేళనముతో రెండవజాము ముగిసెను. వారిరువురూ చెట్టాపట్టాలు పట్టుకొని మావిపొదరిండ్లలోను గోదావరీ సైకతములలోను శైలశృంగము లందును విహరించిరి. గోపాలుఁడు వారి విహారమును కనులు మూసికొనియే చూచెను.

మారుతుని ఆతురోత్కంఠతో మూఁడవ జాము ఆరంభమై వెన్నెలపై పాటుతో అంత మొందెను.

గోపాలుఁడు రెప్పలసందునుండి చూచెను. క్రమముగా రెప్ప లెత్తి చూచెను. వెంటనే మూసికొనెను. రెప్పలు అనుకొనెను: కన్నులారా! మేము మీ తలారులము. మీరే దొంగలగుచో మాపని యేమి?

రాధాహృదయము తుకతుకలాడుచుండెను. ఆమె అనుకొనెను: నీకు అవమానజనకమైనను నీ సర్వేశుఁడు ఆజ్ఞాపించిన కార్యము నుపేక్షింపుము!

గోపాలుఁడు తనలో తాను దూఱుకొనెను. ప్రణయకలహము కలహముగా మాఱుచున్నది. ఏమని చెప్పను? వేషము వేయనక్కఱలేదు లెమ్మందునా? ఎంత చులకఁదనము! ఇందు నా దోషము లేదందునా? అసలు దోషము

అజాయుద్ధమే యగుఁగాక—మేఘగర్జవలెలేనిచో దోషసంభావన యెటులు? ముభా

వగా ఇట్లుండును — కాలమూ, కర్మమూ ఇట్టులు ఒనఁగూడినవి!

రాధ ఇఁక చెప్పివైచెద ననుకొనెను. తీయ మావిపై ఒకకోయిల కుహూకుహూ మనెను. రాధా! తొందరపడకు మనియా, గోపాలా! తొందరపడకు మనియా ఆ పలుకు? ఊహు ఊహూ మని తననే సంబోధించుచున్నటులు గోపాలుఁడు అనుకొనెను.

రాధ దీర్ఘముగా నిట్టూర్చెను. ఆమె పట్టుఁదల యంతయు ఆవిరిగా ఎగిరిపోవుచున్నదని గోపాలుఁడు తలఁచెను. దైవము హాస్యరసిక మని రాధ అనుకొన్నెను. ఆమె నలిసప్పుడుకాకుండ లేచి కూర్చుండెను; ఓరకనులతో చూచెను. చన్ద్రుడా! నీతో నిఁక పనిలేదు.

గోపాలుఁడు ఇది యంతయు చెవులతోడనే చూచుచుండెను. అతఁ డించుకయు కదలలేదు. అతని యుచ్ఛ్వాస నిశ్వాసముల తాళమానము తప్పలేదు.

వంచన తొంగిచూచుచుండెను.

రాధ గోపాలునిపై చేయి వైచెను. పులకలచే ఆమె చేయి పూవ్రదోడఁగెను. ఎఱుఁగనటులు గోపాలుఁడు కనులెత్తెను. రాధ చేతిని మెత్తగా ఆవలికి త్రోసెను. అది వేయి ఆఘాతముల పెట్టు.

ప్రణయ దుఃఖిత కంఠమున పావురమును, కన్నులలో కాఱుమబ్బులును కలవు.

రాధ లోలోపల తలఁచెను —'సర్వధర్మాన్ పరిత్యజ్య మా మేకం శరణం వ్రజ' అని.

ఆమె గద్గదికతో ననెను: 'నీయాజ్ఞ శిరసా వహించెదను. కాని తమరుమాత్రము నా వేషము చూడ రారాదు.'

గోపాలుఁడు హఠాత్తుగా నవ్వి నిమిషమాత్ర మాలోచించెను. పిదప 'రాధా నాహృదయ మాఱిపోయినది' అని ఆమెను బాహువులతో గ్రుచ్చి యెత్తి 'నీవు నాకు భూషణమవు' అనెను.

ఆకసముపై మబ్బుపట్టకయే అతని బాహువులపై ముత్తెములంత రెండు బిందువులు రాలెను. కౌఁగిలి వీడి అతఁడు మిన్నులు చూచుచుండఁగా రాధ కను లొత్తుకొనెను.

3

మనస్సెంత సంగ్రామక్షేత్రము! దొడ్డది కురుక్షేత్రసంగ్రామమా అర్జునమనస్సంగ్రామమా? క్రమక్రమముగా రాధ నాటకభాగములు కొన్ని పఠించెను. ఆమె తొలుత ప్రియంవదాపాత్రమును, అనసూయాపాత్రమునుధరించెను. రసోపాసక బృందమువారు ఐ. సి. యస్. గోపాలుని సాహసమునకు జయపెట్టిరి. రాధను మిగుల గారవముగా చూచుచుండిరి. ఆమె యెన్నఁడును రిహార్సు వెయ్యలేదు.

లోకము తొలుదొలుత ఆమెను దూషించెను; తరువాతఁ దరువాత భూషించెను. రాధ దూషణమునే భూషించెను. పురుషులందఱు అనుకొనిరి—'స్త్రీకి పవిత్రపీఠ మీయఁగా ఆమె తన పవిత్రపీఠమును కాపాడుకొనిన పుణ్యకాలము.'

రాధ ఉత్తరచరితమున సీతాపాత్రము ధరించెను. లోకులు 'అచ్చసీత అచ్చసీత' అనిరి. ఆమె అనుకొనెను—'నాకు ఈపాత్రమెంతయును పాత్రము.'

ఒకనాఁడు ఇంటికడ గోపాలుఁడు రాధతో ఇటు లనెను—'చూచితివా మన కలహబీజము పెద్దవృక్షమై తియ్యపండ్లు ఫలించినది.'

రాధ—ఏమిటి ఆ తియ్యపండ్లు? ఇవి చివరకు చేఁదెక్కును.

గోపాలుఁడు—అది వట్టి పిచ్చి యూహ.

రాధ—కొందఱకు తమయిష్టమే ప్రేమ; కొందఱకు ప్రేమయే ఇష్టము. కొందఱకు ఇష్టమే స్వాతంత్ర్యము; మఱికొందఱకు స్వాతంత్ర్యమే ఇష్టము.

అంత గోపాలుఁడు ఆలోచించుచు ఊరకుండెను.

అపుడు రాధ యిటు లనెను—మఱచి నావేషము చూడవత్తురేమో! అటు లెన్నఁడు కాఁగూడదు. ఇది ఊర్వశి చేసిన సమయము. మీరు మాత్రము రాఁగూడదు.

గోపాలుఁడు దీర్ఘముగా ఆలోచించెను. అతఁడు ఆమెను ఏకాగ్రదృష్టితో చూచెను.

'ఈ రేయి నా ధరింపబోవు వసంతసేనాపాత్రమును ఇపుడే చూచెదరా యేమి?' అని రాధ యనెను.

'వసంతసేనా? వసంతసేనే? నీవే నావసంతసేనవు. నావసంతసేనను నే నిపుడే చూచికొందును. నేనే చారుదత్తుఁడను. నీసువర్ణభాండము దాఁచెదను. నిన్ను మీయింటికడ దింపివచ్చెదను. వర్షమున వచ్చిన నిన్ను కౌఁగిలించికొందును........

ఆ ఏమి? శకారుని నీమెడ తాఁకనీయక నెట్టివైచెదను. ఏదీ, నాముందు నిలుకడగా నిలువుము! వసంతసేనా! నిన్ను చూపులతో త్రావివైచెదను' అని గోపాలుఁడు రాధను వక్షమున చేర్చికొన దాపులకుఁ బోయెను.

'ఇక్కడే నాటకము చేయకుఁ'డని రాధ వెనుక వెనుకకు ఒదిగెను.

'ఒక్కసారి దాపున నిలువు'మని గోపాలుఁడు బతిమాలుకొనెను.

'నే నిఁక పాత్రధారణమునకు పోవలయు'నని రాధ యనెను.

గోపాలుఁడు ముందులకు నడిచెను.

మోటారు డ్రైవరు 'అమ్మా' యని ముంగిట కేకవైచెను.

౪

గోపాలుఁడు మంచముపై పడుకొనెను. అతనికి కూర్కు రాలేదు. నిదుర పట్టినచో ఒకటిరెండుకలలు; నిదురపట్టనిచో ఒకదీర్ఘస్వప్నము. ఆకలలో నాంది లేదు; నాటక మారంభమయినది. వసంతసేన వచ్చెను. చారుదత్తుఁ డుత్తరీయ మిచ్చెను. దానిని తీసికొన్న వసంతసేనకు పులకలెత్తెను.

స్వప్నములో గోపాలుఁడు జలదరించెను.

చారుదత్తుఁడు వెన్నెలలో వసంతసేనను మేడ దాఁకఁ బంపెను.

కలలో మఱొకకవులు: బ్రాహ్మమతము పునర్జన్మ మంగీకరింపకుండుట లెస్సకాదు. చూచుచుండఁగనే రాధ వసంతసేనయై తనను విడిచి చారుదత్తు నభిసరించుచున్నది.

గోపాలుఁడు 'ఆఆఆ' యని పలవరించెను.

అతఁడు కలలో 'మీరుమాత్రము చూడ రాఁగూడదు' అని వినెను.

అతఁడు గభాలున లేచెను. కుదుటఁబడి కలయంతయు గుఱుతు దెచ్చికొని గడియారము చూచెను. పదకొండు పండ్రెండుల నడుమ. గోపాలుఁడు దుస్తులు వేసికొనియెను. మోటారు డ్రైవరును పిలిచెను. అతనిని నాటకమునకు మోటారు తోలుమనెను. 'అమ్మగారి ఆజ్ఞ లేదు' అని అతఁడు నిరాకరించెను. నవ్వుకొని గోపాలుఁడే మోటారు నడిపించుకొని పోయెను.

చారుదత్తుఁడును విదూషకుఁడును రంగమున నున్నారు. అది వానాకాలము. జలయంత్రము రంగమున వర్షించుచున్నది. జనులు అక్కజపడి చూచుచున్నారు.

ఉజ్జ్వలాభిసారికావేషముతో ముత్యాలగొడుగు వైచికొని 'కమలము కేలలేని సిరి', 'కాముని చేతి మృదుప్రహేతి', 'శోకము మగనాండ్ర కందఱకు', 'కంజశరాగమపుష్పము', వసంతసేన "సిగ్గు పోడిమిగల కూర్మితో" చారుదత్తు నభిసరింప వచ్చుచున్నది.

మబ్బు లుఱిమినవి.

'గీ. ఉఱుముఁగాక! పయోదముల్ కురియుఁగాక!
పిడుగు పడుఁగాక! యగుఁగాక పుడమి కడలి!
చలియు వేఁడియుఁ జూడరు లలన లకట!
రమణసాన్నిధ్యమున కేఁగు సమయమందు.'

అని అన్నది వసంతసేన.

విటుఁడు వర్షమును వర్ణించి వర్ణించి

గీ. అలిగితివయేని లేదు సౌఖ్యంబు కోప-
గింపకున్నను మదనుండు కీర్తి తేఁడు
అలుగు మలిగింపు మొకవేళ నతనిఁగూడ
కరుణాజూపుము! పడయు మాఘునునికరుణ.

అనెను.

సభ్యు లందఱూ రెప్ప వాల్పక చూచుచున్నారు. 'వర్షవర్ణన చాలు. ఇది ప్రబంధము కాదు. నాటకము చుమీ. వసంతసేనా, వడిగానడు వడిగానడు' అని యువకు లనుచున్నారు.

గోపాలుఁడు లేవబోయి కూర్చుండెను.

వసంతసేన కూర్చుండి పువ్వులు రువ్వుచు— 'జూదగాఁడా! ప్రదోషకాలము సుఖకరముగా నున్నదా?' అని చారుదత్తునితో అనెను.

గోపాలుని హృదయము స్వస్థానమున లేదు. అది కన్నులలో నున్నది. చూపులనుండి దాని విడఁదీయఁజాలము. మన మొకవేళ అందు ప్రవే

శింపఁగలిగితిమేని చిమ్మనఁగ్రోవిలోని నీటివలె వసంతసేనలో పోయి పడుదుము.

చారుదత్తుఁడు—

గీ. కలికి చెవిమీఁద నిడుకొన్న కడిమిపూవు
నుండి జాఱెడు వర్షబిందువులచేతఁ
దడుపఁబడుచున్న దీ పయోధరము రాచ-
బిడ్డ యభిషేక మొనరింపఁబడ్డ రీతి.

అని విదూషకునకుఁ జూపెను.

ఐ. సి. యస్. గోపాలుఁడు లేచి బలవంతముగా మఱల కూరుచుండెను.

వసంతసేన చారుదత్తుని కౌఁగిలించుకొనబోవ సన్నాహపడుచుండెను. చారుదత్తుఁడు ప్రత్యాలింగనమున కాయత్తుఁ డగుచుండెను.

వారి యిరువురినడుమకు గోపాలుఁ డొక్క-పెట్ట ఉఱికెను.

బిచ్చగాఁడు

నాళము కృష్ణరావు గారు

ఒకచేత జోలెయు, నొకచేత కోల - పుచ్చుక తిరుగాడె బిచ్చగాఁ డొకఁడు
వాడవాడలవెంట పాడుచు నిట్లు:

'అవనితలంబున నాదిభిక్షుకుని - యపరావతారమై యవతరించితిని;
పృథివిలోఁ గలయట్టి వృత్తులలోన - బిచ్చంపువృత్తియె హెచ్చైనవృత్తి;
చెట్టునీడలె నాకు పట్టెమంచములు - చినుఁగుబట్టలె నాకు చీనాంబరములు
పుట్టగోచియె నాకు పట్టుపుట్టంబు - భిక్షాన్నమే నాకు పిండివంటకము
బూదిపూఁతయె నాకు పునుఁగు జవ్వాది - పూరికొంపయె నాకు భూరిసౌధంబు;
రాజ్య మెవ్వారి దైన, రా జెవ్వ రైన - నా కేమిలక్ష్యంబు? నా కేమికొదువ?
రాజశాసనములు రాజ్యాంగవిధులు - ఎన్ని మాఱెన యేని న న్నేమి సేయు?
కఱవుపై కఱవులు కలుగుఁ గా కేమి - పెట్టఁడే యెవఁ డైన పట్టెఁడోగిరము?
సంతత మీశ్వరస్మరణమే కాని - యితరచింతలు నాకు నెవ్వియు లేవు;
అన్యులపదవుల నాసింపఁబోవ - పరులు నాపదవికి వాంఛింపఁబోరు;
లక్షాధికారి యా భిక్షాధికారి - భిక్షాధికారి తా భేదంబు గనఁడు;
భిక్షుకవృత్తియే విశ్వేశ! నాకు - జన్మజన్మముల ప్రసాదింపు మయ్య,
పాడిపంటలు గల్గి భాగ్యంబు గల్గి - ఎల్ల వారలు సుఖియింతురు గాక!'